తెలంగాణ TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 31- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 88 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలకు కొత్త దిశ

- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్
- 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- మౌలిక వసతులు, కృత్రిమ మేధలో సహకారం విస్తరణ
- ప్రధాని నరేంద్ర మోదీ

**తాష్కెంట్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మీర్జియోయేవ్ మధ్య తాష్కెంట్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చలు కీలక ఫలితాలను ఇచ్చాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వాటిని సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై దృష్టి సారించాయి. ప్రస్తుతం ఉన్న వాణిజ్య స్థాయిని గణనీయంగా పెంచుతూ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం వ్యాపార, పెట్టుబడి అవకాశాలను పెంపొందించడంతో పాటు కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు అంగీకరించారు.

మిగతా 2లో

## నాగిలిగొండ అభివృద్ధికి రూ.6.10 కోట్లు

- బీటీ రోడ్డు, సీసీ రోడ్ల పనులకు శ్రీకారం
- గ్రామ మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి
- ప్రజా ప్రభుత్వంతో వేగంగా అభివృద్ధి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో





## హైదరాబాద్-బీజాపూర్ హైవే పనుల పరిశీలన

చేవెళ్ల సమీపంలో పనుల పురోగతిపై సమీక్ష

రోడ్డు మౌలిక వసతుల బలోపేతమే కేంద్ర లక్ష్యం

తెలంగాణ అభివృద్ధికి కనెక్టివిటీ కీలకం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2లో

## రష్యాకు పెట్రోల్ పంపుతున్న భారత్

డ్రోన్ దాడులతో రిఫైనరీలకు దెబ్బ

ఇంధన కొరతతో దిగుమతుల నిర్ణయం

10 లక్షల బ్యారెళ్ల సరఫరా చేసిన భారత్

గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా ఎదుగుదల



**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని పలు చమురు శుద్ధి కర్మాగారాలు తీవ్రంగా దెబ్బతినడంతో అక్కడ ఇంధన ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో దేశీయ అవసరాలను తీర్చుకోవడానికి రష్యా విదేశాల నుంచి పెట్రోల్ దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ పరిణామం ప్రపంచ ఇంధన రంగంలో భారత్ ప్రాధాన్యాన్ని మరింత పెంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

మిగతా 2లో

## సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

కుటుంబ రాజకీయాలకు భిన్నమని వ్యాఖ్య

వాజ్‌పేయి, మోదీ నాయకత్వాన్ని ప్రస్తావన

రామమందిరం, ఆర్టికల్ 370పై ప్రశంసలు

ప్రజాస్వామ్య విలువలే పార్టీ బలం

ఎంపీ ఈటెల రాజేందర్



**మేడ్చల్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజిగిరి (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన డి. గిరివర్ధన్ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం, జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పార్టీ సిద్ధాంతాలు, దేశాభివృద్ధి, స్వాతంత్ర్య ఉద్యమం, బీజేపీ రాజకీయ ప్రస్థానంపై విస్తృతంగా మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ ఒక వ్యక్తి లేదా కుటుంబానికి చెందిన పార్టీ కాదని, దేశ హితం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన సిద్ధాంత పార్టీ అని స్పష్టం చేశారు.

మిగతా 2లో



## బీసీ జనగణనపై కేంద్రాన్ని నిలదీసిన శ్రీనివాస్ గౌడ్

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లకు డిమాండ్

బీసీ కులాలకు ప్రత్యేక నంబరింగ్ అవసరమని వ్యాఖ్య

కాంగ్రెస్, బీజేపీ వైఖరిపై విమర్శలు

ఓబీసీల హక్కుల కోసం పోరాటం తప్పదని హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

బిఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీసీ జనగణన, రిజర్వేషన్ల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, జాతీయ రాజకీయ పార్టీల వైఖరిని తీవ్రంగా విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని మెజారిటీ వర్గాలకు రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఆయన అన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వారి హక్కుల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రాజకీయ నాయకులు పదేపదే చెబుతున్నప్పటికీ, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీ జనగణన నిర్వహించి ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని డిమాండ్ చేశారు. కులాల వారీగా అధికారిక గణాంకాలు లేకుండా రిజర్వేషన్ల శాతం నిర్ణయించడం న్యాయపరంగా నిలబడదని, అందుకే కోర్టుల్లో అనేక నిర్ణయాలు నిలిచిపోతున్నాయని చెప్పారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్ వంటి రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తీసుకువచ్చినా, సరైన చట్టపరమైన ఆధారాలు లేకపోవడం వల్ల న్యాయస్థానాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. సెన్సస్‌లో బీసీలకు సంబంధించిన పూర్తి వివరాలు


మిగతా 7లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలకు కొత్త దిశ

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా సేవల వ్యవస్థ, కృత్రిమ మేధ, కీలక ఖనిజాలు, ఇంధన రంగం, అంతరిక్ష పరిశోధన వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని చర్చల్లో నిర్ణయించారు. ఈ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల నాయకులు అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా అనుసంధానం, వాణిజ్య మార్గాల విస్తరణ, బ్యాంకింగ్ సేవల



బలోపేతం, చెల్లింపు వ్యవస్థల అనుసంధానం వంటి అంశాలపై ఇరు దేశాలు కార్యాచరణ చేపట్టనున్నాయి. దీనివల్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి మరింత ఊతం లభించనుంది.

భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నప్పటికీ ఇటీవల సంవత్సరాల్లో ఆర్థిక, వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. మధ్య ఆసియాలో భారత్ ప్రభావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో ఉజ్బెకిస్తాన్‌కు కూడా భారత మార్కెట్, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయి. తాష్కెంట్ చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశించాయని అధికారులు పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, అంతరిక్షం సహా అనేక రంగాల్లో సహకారం మరింత విస్తరించనుంది. రాబోయే సంవత్సరాల్లో భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలు మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# హైదరాబాద్-బీజాపూర్ హైవే పనుల పరిశీలన

**వికారాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

వికారాబాద్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. చేవెళ్ల సమీపంలోని మల్కాపూర్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, పనుల నాణ్యత, వేగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయని పేర్కొన్నారు.



తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ, ఆధునికీకరణ ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, వ్యాపార రంగాలకు కూడా ఊతం లభిస్తుందని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య దూరాలు తగ్గి ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత సులభతరం అవుతుందని చెప్పారు. హైదరాబాద్-బీజాపూర్ హైవే అభివృద్ధి పూర్తయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం అవుతాయని, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. రహదారి నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రహదారి పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హైవే అభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు భద్రతాయుత రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. రహదారి పనుల వేగవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.

# రష్యాకు పెట్రోల్ పంపుతున్న భారత్

(మొదటి పేజీ తరువాయి)

వోర్టెక్సా అనే అంతర్జాతీయ ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం గత రెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల ప్రభావంతో దేశీయ పెట్రోల్ ఉత్పత్తి దాదాపు 70 శాతం మేర తగ్గిపోయినట్లు అంచనా వేస్తున్నారు. ఫలితంగా రష్యాలోని అనేక నగరాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఇంధన కొరత తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రష్యా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈ సంక్షోభ సమయంలో భారత్ రష్యాకు అండగా నిలిచింది. జులై, ఆగస్టు నెలల్లో భారత్ నుంచి దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్ రష్యాకు ఎగుమతి అయినట్లు వాణిజ్య వర్గాలు వెల్లడించాయి. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో దేశాలు కూడా రష్యాకు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో అధిక భాగం జరిగినట్లు సమాచారం. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

మరోవైపు ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా భారత్ తన సామర్థ్యాన్ని వేగంగా పెంచుకుంటోంది. ప్రస్తుతం 272 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని 300 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో ఆసియా ప్రాంతంలోనే కాకుండా ప్రపంచ ఇంధన మార్కెట్లో కూడా భారత్ కీలక రిఫైనింగ్ కేంద్రంగా ఎదుగుతోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల పేర్కొన్నారు.

ఇరాన్ యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతుల వనరులను కూడా విస్తరించింది. ఒకప్పుడు 27 దేశాల నుంచి మాత్రమే చమురు కొనుగోలు చేసిన భారత్ ప్రస్తుతం 41 దేశాల నుంచి దిగుమతులు చేస్తోంది. ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేశ ఇంధన భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అయితే ముడి చమురు సరఫరాలో రష్యా ప్రాధాన్యం ఇంకా కొనసాగుతోంది. కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో రష్యా నుంచి భారత్‌కు వచ్చిన ముడి చమురు దిగుమతులు స్వల్పంగా తగ్గి రోజుకు 2.1 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నప్పటికీ, మొత్తం దిగుమతుల్లో దాదాపు 40 శాతం వాటాతో రష్యానే అతిపెద్ద సరఫరాదారుగా నిలిచింది. ఒకవైపు రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటూనే, మరోవైపు అదే దేశానికి పెట్రోల్ ఎగుమతి చేయడం ద్వారా భారత్ అంతర్జాతీయ ఇంధన రంగంలో తన వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

సభలో మాట్లాడిన ఈటెల రాజేందర్, "దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తిగతం లాస్ట్" అనే భావజాలమే బీజేపీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల కోసమే ఉంటుందని, స్వప్రయోజనాల కోసం కాదని చెప్పారు. బీజేపీ ఎన్నికల కోసం మాత్రమే పనిచేసే పార్టీ కాదని, ప్రజల అవసరాలు, దేశ అభివృద్ధి, సామాజిక మార్పుల కోసం నిరంతరం కృషి చేసే ప్రజా కేంద్రిత రాజకీయ సంస్థ అని వివరించారు. ఈ నేపథ్యంలో కొత్త జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. దేశం 80వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో గత చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈటెల పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దేశ మౌలిక వసతుల అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందన్నారు. స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్టు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి కార్యక్రమాలు దేశ ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వ



పరిమితులు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాలే లక్ష్యంగా వాజ్‌పేయి పనిచేశారని కొనియాడారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఈటెల తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం దశాబ్దాల కల సాకారమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆకాంక్షను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. రామమందిర ఉద్యమం వెనుక ఉన్న నాయకుల త్యాగాలు, కృషిని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు దేశ సమైక్యతకు బలమైన నిర్ణయమని ఈటెల అభిప్రాయపడ్డారు. దేశానికి ఒకే జెండా, ఒకే చట్టం ఉండాలనే శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షను మోదీ ప్రభుత్వం కార్యరూపం దాల్చిందన్నారు. దేశ సమగ్రత, జాతీయత భావాలను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వేచ్ఛను దేశ ప్రజలందరికీ సమానంగా అందించాలనే లక్ష్యంతో బీజేపీ పనిచేస్తోందన్నారు.

పార్టీ నిర్మాణంలో ప్రజాస్వామ్య విధానాలకు బీజేపీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. పార్టీ పదవులు కుటుంబ వారసత్వం ఆధారంగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక అవుతాయని చెప్పారు. ప్రధానమంత్రి నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు ప్రతి నాయకత్వ స్థానానికి సంస్థాగత ప్రక్రియల ద్వారానే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సిద్ధాంతాలు, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవ అనే నాలుగు స్తంభాలపై బీజేపీ నిర్మితమైందని, తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# నాగిలిగొండ అభివృద్ధికి రూ.6.10 కోట్లు

**ఖమ్మం, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

మధిర నియోజకవర్గం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామ అభివృద్ధికి రూ.6.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగిలిగొండ నుంచి తుతికుంట వరకు రూ.5.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

అలాగే నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. కాలనీలో నివసించే ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

నాగిలిగొండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



## మోటమర్రిలో గోదాం ప్రారంభం..
# రోడ్లకు శంకుస్థాపన

- రూ.24.50 లక్షలతో గోదాం నిర్మాణం
- 300 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం
- ఎస్సీ కాలనీలో రూ.1 కోట్ల సీసీ రోడ్లు
- రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యమన్న ఉప ముఖ్యమంత్రి

**ఖమ్మం, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

బోనకల్ మండలం మోటమర్రి గ్రామంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌సీడీసీ పథకం కింద పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన గోదామును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. రూ.24.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ గోదాం 300 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో రైతులకు ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా గోదాం భవనాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పంటలను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశంతో రైతులు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విక్రయాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

అనంతరం మోటమర్రి ఎస్సీ కాలనీలో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. కాలనీలో రహదారుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.

రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తోందని చెప్పారు. సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. మోటమర్రి గ్రామంలో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక వసతుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
సోమవారం - 31 - ఆగస్టు - 2026


## వైభవంగా ఎస్ ఐ ఓ వ్యాసరచన మరియు వకృత్వ పోటీల బహుమతుల ప్రధానోత్సవం



**ఖమ్మం బ్యూరో,ఆగష్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):** స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 16న నిర్వహించిన వ్యాసరచన మరియు మరియు వకృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం ఘనంగా ఎస్ ఐ ఓ ఖమ్మం శాఖ కార్యాలయం అజీజ్ వీధిలో ఆదివారం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ ఐ ఓ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హఫీజ్ హమ్మదుద్దీన్ ప్రసంగిస్తూ విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి విద్యతో పాటు నైతిక విలువలు నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు అలాగే మరొక అతిథిగా విచ్చేసిన జమాతే ఇస్లామి ఖమ్మం నగర అధ్యక్షులు జైనుల్ పాషా మాట్లాడుతూ విద్యార్థులు చదవడం,రాయడం మరియు మాట్లాడడం వంటి కలలను అభివృద్ధి చేసుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు అని అన్నారు.న్యాయనిర్ణేతగా వ్యవహరించిన విద్యావేత్త మహమ్మద్ రఫీ మాట్లాడుతూ విద్యార్థులు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగిస్తూ మంచి నడవడికతో ప్రవర్తనతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సందేశమిచ్చారు. వ్యాసరచన పోటీలలో ప్రధమ బహుమతి టి వర్ధన్ ( ఆక్స్ ఫోర్డ్ స్కూల్) రెండవ బహుమతి పి .అంకిత (ప్రభుత్వ ఉన్నత పాఠశాల రోటరీ నగర్ ) తృతీయ బహుమతి పి . గృహిత్ రాజ్ (వివిసి స్కూల్) కన్సోలేషన్ బహుమతులు రిషిత (న్యూవిజన్ స్కూల్ ) మరియు సారా తెహసిన్ (త్రివేణి స్కూల్) బహుమతులు పొందారు అదేవిధంగా వకృత్వ పోటీలలో ప్రధమ బహుమతి వి.లక్ష్మి శ్రీజ (కవితా కాలేజ్ ) ద్వితీయ బహుమతి డి .హరి చరణ్ (త్రివేణి స్కూల్ ) తృతీయ బహుమతి జి సోనాక్షి (త్రివేణి స్కూల్ ) కన్సోలేషన్ బహుమతులు ఎస్ .పార్ధు (వీవీసి) మరియు సమ్రా సరుష్ (ఆక్స్ ఫోర్డ్ స్కూల్) బహుమతులు పొందారు పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 2000 రూపాయలు ,ద్వితీయ బహుమతి 1500 రూపాయలు ,తృతీయ బహుమతి 1000 రూపాయలు మరియు రెండు కన్సోలేషన్ బహుమతులుగా 500 రూపాయలు ఇవ్వడం జరిగిందని ఎస్ ఐ ఓ ఖమ్మం శాఖ అధ్యక్షుడు మతీన్ తెలిపారు, పోటీల నిర్వహణకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలు ,న్యాయ నిర్ణేతలకు ,ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు ఎస్ఐఓ ఖమ్మం జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది .ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఓ ఖమ్మం ప్రతినిధులు అతీఖ్,అసీల్,కమ్రాన్ అనస్ ఏజాజ్ ,షోయిబ్ ,అయ్యూబ్, ఫర్హాన్ రయ్యన్ మరియు విద్యావేత్తలు ,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాజుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించిన రవిచంద్ర..



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 30(తెలంగాణ ముచ్చట్లు):**ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ నేత, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తాజుద్దీన్ కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా తాజుద్దీన్ పార్టీ పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేసిన చురుకైన నాయకుడు అని, ఖమ్మం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారని రవిచంద్ర గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి, మైనార్టీ సామాజిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు.

తాజుద్దీన్ కుటుంబ పరిస్థితిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, పార్టీ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని రవిచంద్ర భరోసా ఇచ్చారు.

వారి కుటుంబానికి, ముఖ్యంగా పిల్లలకు ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని సూచిస్తూ, వారు ఏమాత్రం మనోధైర్యం కోల్పోవద్దని ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ కార్పొరేటర్ మక్బుల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి , సద్దాం, ఫిరోజ్, మహమ్మద్ రఫీ, షారుక్ అర్షత్, మునఫ్, బురహాన్, ఆసిఫ్, హిజార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సంక్షేమమే లక్ష్యం

- **పి.వి.ఎన్.ఆర్ కాలనీలో సిఇఆర్ క్లబ్, కమ్యూనిటీ హాల్ ప్రారంభం.**




**సత్తుపల్లి, ఆగస్టు 30(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ఏరియాలోని పి.వి.ఎన్.ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సిఇఆర్ క్లబ్, కమ్యూనిటీ హాల్‌ను సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి యాజమాన్యం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్మికులు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేసుకోవడానికి సిఇఆర్ క్లబ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే కాలనీవాసులు కుటుంబ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు నూతన కమ్యూనిటీ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సభాధ్యక్షులు, ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. వెంకట చారి మాట్లాడుతూ పి.వి.ఎన్.ఆర్ కాలనీవాసులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అందుబాటులోకి వచ్చిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ప్రాజెక్ట్ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, గుర్తింపు మరియు ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

- **తలసేమియా చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక**
- **సంకల్ప వార్షికోత్సవంలో సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ.విజయ్‌బాబు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్**



**ఖమ్మం బ్యూరో,ఆగస్టు 30(తెలంగాణ ముచ్చట్లు):** తలసేమియా వ్యాధి నిర్మూలనకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా పనిచేయాలని, బాధిత చిన్నారులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక అని సీటీసీ అడిషనల్ డీసీపీ విజయ్ బాబు పేర్కొన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఈ.విజయ్‌బాబు మాట్లాడుతూ.. కేవలం వార్షికోత్సవాలు జరుపుకోవడమే కాకుండా, తలసేమియా బాధితుల సంఖ్యను తగ్గించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంకల్ప సంస్థ గత 16 ఏళ్లుగా అందిస్తున్న సేవలు మార్గదర్శనీయం అని కొనియాడారు. రక్తం కొరతతో ఏ ఒక్క తలసేమియా చిన్నారి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చనే అవగాహనను ప్రతి ఒక్కరిలోనూ పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులకు మెరుగైన జీవనాన్ని, భరోసాని అందించడమే మనందరి ప్రధాన లక్ష్యం కావాలని ఆకాంక్షించారు.

పిల్లల ఆరోగ్యంతో పాటు ఉన్నత భవిష్యత్తు ముఖ్యం :

సమాజంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ పిల్లలు ఉన్నతమైన భవిష్యత్తును సాధించాలని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సొంత కుటుంబ సభ్యుల సమస్యలనే పట్టించుకోలేని వర్తమాన సమాజంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రవి, అనిత బాధ్యతాయుతంగా పిల్లల సంక్షేమం కోసం సేవలు అందించడం విశేషమన్నారు. పిల్లలను సమాజంలో ఇతరులతో సమానంగా చూడాలని, వారి ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల సమాజం సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు.

పిల్లలతో ముఖాముఖి..

కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కిరణ్ కుమార్ తలసేమియా చిన్నారులతో నేరుగా ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తమ లక్ష్యాలను సాధించాలని, పూర్తి ధైర్యవంతులుగా ఎదగాలని సూచించారు. ఏఆర్ ఆర్ఐ కామరాజు మాట్లాడుతూ... తలసేమియా చిన్నారులకు ఎప్పుడు రక్తం అవసరమైనా రక్తదానం చేసేందుకు తాము సిద్ధంగా ఉంటామని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించే సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు సహకారం అందిండం ద్వారా తాము సేవలో భాగం అవుతున్నామని, ఇది మానసిక సంతృప్తినిస్తుందని అన్నారు. అనంతరం రక్తదాతలను, చిన్నారుల కోసం సంస్థకు సహకారం అందిస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, ప్రముఖ విద్యావేత్తలు భాగ్య, మమత, సామాజికవేత్త అనురాధ, సంస్థ బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, ఆర్.కస్తూరి, పి.వంశీకిరీటి, సువర్ణకుమారి, ఏఆర్ కానిస్టేబుల్ క్రిష్ణ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటానికి ఢిల్లీ బాట



**ఎల్కతుర్తి ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎల్కతుర్తి మండలం నుంచి సీపీఐ నాయకులు ఆదివారం ఢిల్లీకి బయలుదేరారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరు రాములు, మారుపాక అనిల్‌కుమార్, నిమ్మల మనోహర్, మర్రి విజయ్, మరిపెల్లి తిరుమల, గడ్డం లలిత తదితరులు బయలుదేరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరు రాములు మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీలు ఇచ్చిందన్నారు. అయితే ఆ హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని, ఎనిమిది గంటల పని విధానానికి విఘాతం కలిగించే చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు. లక్షల కోట్ల రూపాయలను రాయితీల పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తుందని అన్నారు. ప్రజా, కార్మిక, రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- **పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పరిణత**

**పెద్దమందడి,ఆగస్టు30(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పరిణత సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి వేదిక అని తెలిపారు.మండలంలోని పలు గ్రామాల్లో వివిధ సమస్యలు నెలకొన్నాయని, ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేయాలని వారు కోరారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో పరిణత కోరారు.



## సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

- **కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్‌కుమార్**



**ఎల్కతుర్తి, ఆగస్టు 30 ( తెలంగాణ ముచ్చట్లు):** నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలో కందుకూరి జ్యోతి-శ్రీనివాస్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శీలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు కందుకూరి జ్యోతి-శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతో నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి తమ కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గౌడిశాల రాజయ్య, కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జనగాని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీపతి సదానందం, కాంగ్రెస్ నాయకులు శ్రీపతి బిక్షపతి, గౌడిశాల వినయ్, నాగరాజు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రజాసేవలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకిత భావమే ఉద్యోగికి నిజమైన సంపద... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



- **నిబద్ధతతో ప్రజలకు అందించిన సేవలే శాశ్వత గుర్తింపుగా నిలుస్తాయి**
- **31 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో కారుమంచి శ్రీనివాసరావు అంకితభావ సేవలను ప్రశంసించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు- 30(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో 31 సంవత్సరాల పాటు సేవలందించి, తహసీల్దార్ క్యాడర్ లో ప్రస్తుతం కలెక్టరేట్ పరిపాలన అధికారిగా ఉద్యోగ విరమణ చేస్తున్న కారుమంచి శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించి, ఆయన సుదీర్ఘ ఉద్యోగ సేవలను అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం కేవలం జీవనోపాధి కోసం చేసే ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి లభించే ఒక గొప్ప అవకాశమని అన్నారు. కారుమంచి శ్రీనివాసరావు 31 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించారని కలెక్టర్ కొనియాడారు. ముఖ్యంగా కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన వైఖరితో పాటు సహచర ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అని అన్నారు.

ఒక అధికారి లేదా ఉద్యోగి బాధ్యతలు నిర్వహించేటప్పుడు అందరినీ కలుపుకొని వెళ్లే మనస్తత్వం ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎదుటివారి సమస్యను అర్థం చేసుకుని, వారి అవసరాన్ని ముందుగానే గుర్తించి సమన్వయంతో పరిష్కారం చూపే సామర్థ్యం శ్రీనివాసరావులో ఉందని అన్నారు. అవసరమైన సందర్భాల్లో కఠినంగా వ్యవహరిస్తూనే, మరోవైపు సహచరులు, సిబ్బందితో సున్నితంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ఆయనలోని ప్రత్యేక లక్షణమని కలెక్టర్ కొనియాడారు.

పనితీరులో అవసరమైన చోట కఠినంగా, వ్యక్తిత్వంలో మాత్రం ఎంతో సున్నితంగా, అందరికీ సహాయం చేయాలనే తపన ఉండటం శ్రీనివాసరావు ప్రత్యేకత అని, గత కొద్ది నెలలుగా ఆయనతో కలిసి పనిచేసిన సమయంలో ఈ లక్షణాలను నేను గమనించాను అని కలెక్టర్ తెలిపారు.

శ్రీనివాసరావు పట్ల సహచర అధికారులు, ఉద్యోగుల్లో ఉన్న గౌరవం ఆయన ఉద్యోగ జీవితంలో సంపాదించుకున్న మంచి పేరు, విశ్వసనీయతకు నిదర్శనమని కలెక్టర్ అన్నారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా ఇతర జిల్లాల నుంచి కూడా అధికారులు, ఉద్యోగులు వచ్చి అభినందనలు తెలియజేయడం ఆయన పట్ల ఉన్న ఆత్మీయతకు, గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒక ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో సంపాదించుకోవాల్సిన అసలైన ఆస్తి మంచి పేరు, నమ్మకం, గౌరవమేనని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలో శ్రీనివాసరావు చూపిన నిబద్ధత, అంకితభావం, సమన్వయంతో పనిచేసే విధానం యువ ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.

ఉద్యోగ జీవితంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమని కలెక్టర్ గుర్తు చేశారు. విధి నిర్వహణలో సమయం, శ్రమ, బాధ్యతలను వెచ్చించే ఉద్యోగులకు కుటుంబ సభ్యులు అర్థం చేసుకుని అందించే సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. శ్రీనివాసరావు సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఆయనకు కుటుంబ సభ్యులు అందించిన సహకారం అభినందనీయమని అన్నారు.

పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి మాత్రమే ముగింపు అని, జీవితానికి కాదని కలెక్టర్ అన్నారు. ఇంతకాలం ఉద్యోగ బాధ్యతలకు సమయం కేటాయించిన ఆయన ఇకపై తన కుటుంబ సభ్యులతో మరింత సమయం గడుపుతూ ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. జీవితంలోని రెండో ఇన్నింగ్స్‌ను కూడా అదే ఉత్సాహంతో ప్రారంభించి, తన సుదీర్ఘ ఉద్యోగ అనుభవాన్ని సమాజానికి, యువతకు పంచాలని సూచించారు.

అంతకుముందు పలువురు అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ కారుమంచి శ్రీనివాసరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యాలయ నిర్వహణలో ఆయన చూపిన చొరవ, సమస్యలను పరిష్కరించడంలో సమన్వయంతో వ్యవహరించే తీరు, సహచర ఉద్యోగులకు అందించిన సహకారం, ప్రజల పట్ల ఆయనకున్న బాధ్యతాయుత వైఖరిని కొనియాడారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్లు కలిసి కారుమంచి శ్రీనివాసరావు దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా కారుమంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సేవలో పనిచేసే అవకాశం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, తన ఉద్యోగ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలు, సహచరుల సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామమూర్తి, డీఎస్డీఓ సునీల్‌రెడ్డి, డీఆర్‌డీఓ శ్రీరాం, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముజాహీద్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, ఉప కార్మిక శాఖ కమిషనర్ కె. విజయభాస్కర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దామెర రైతులకు అందుబాటులోకి రైతు మార్కెట్





**ఎల్కతుర్తి, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామీణ రైతులకు తమ పంటలకు స్థానికంగానే మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో దామెర గ్రామంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన రైతు మార్కెట్ (కూరగాయల మార్కెట్)ను ఆదివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మంకని పద్మ చేరాలు, ఉపసర్పంచ్ మద్దే కుమార్, బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కలిసి రైతు మార్కెట్‌ను ప్రారంభించారు. ప్రతి ఆదివారం నిర్వహించనున్న ఈ రైతు మార్కెట్ ద్వారా దామెర గ్రామంలో కూరగాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లకుండా గ్రామంలోనే నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు, సమయం ఆదా కావడంతో పాటు తమ పంటలకు మెరుగైన ధర పొందే అవకాశం ఉంటుందన్నారు. 'మన పంట.. మన గ్రామం.. మనకు మనమే' అనే ఆలోచనతో ఏర్పాటు చేసిన ఈ మార్కెట్ రైతు-వినియోగదారుల మధ్య నేరసంబంధాన్ని పెంపొందించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు తాజా కూరగాయలు నేరుగా రైతుల వద్ద నుంచే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దామెరలో పండించిన కూరగాయలకు దామెరలోనే మార్కెట్ కల్పించడం ద్వారా స్థానిక రైతులకు ప్రోత్సాహం లభించడంతో పాటు గ్రామ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో రైతు మార్కెట్‌ను మరింత విస్తరించి ఎక్కువ మంది రైతులు, కూరగాయల సాగుదారులు, చిన్న వ్యాపారులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దామెర గ్రామ సర్పంచ్ మంకని పద్మ చేరాలు, ఉపసర్పంచ్ మద్దే కుమార్, బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



**వనపర్తి,ఆగస్టు30(తెలంగాణ ముచ్చట్లు-):** ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు తమ విశ్రాంత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు, వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు.

బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్)లో 32 ఏళ్ల పాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన తలారి వెంకటస్వామిని వనపర్తి మైన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను అంకితభావంతో నిర్వహించిన వారు ఉద్యోగ విరమణ అనంతరం కూడా అదే స్ఫూర్తితో సామాజిక సేవలో భాగస్వాములు కావాలని అన్నారు.బీఎస్ఎన్ఎల్‌లో వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన వెంకటస్వామి సేవలను ఆయన కొనియాడారు. వినియోగదారులతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని, విధి నిర్వహణలో చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పలుస రమేష్‌గౌడ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, జైభీమ్ సేవా సంఘం అధ్యక్షులు బండారు శ్రీనివాస్, వాక్యత్త బైరోజు చంద్రశేఖర్, కవి నిరంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొలం గట్టున ఆత్మీయ పలకరింపు..

- **శ్రమజీవుల చెంతకు చేరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**ఖమ్మం బ్యూరో , ఆగస్టు- 30(తెలంగాణ ముచ్చట్లు):** మండుటెండను సైతం లెక్కచేయకుండా రోజంతా పొలంలో చెమటోడ్చి పనిచేసిన ఆ శ్రమజీవులకు.. ఆదివారం ఓ మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట శివారుల్లో కనిపించిన ఓ అరుదైన దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.. హంగూ ఆర్భాటాలకు దూరంగా, నేరుగా పంట పొలాల్లో కూలీ పనులు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లారు.

మధ్యాహ్న భోజనానికి సిద్ధమవుతూ క్యారేజీలు విప్పుకుంటున్న ఆడబిడ్డల మధ్యకు ఆయన ఓ సొంత అన్నలా అడుగులు వేశారు. హోదాను పక్కన పెట్టి.. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

"ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మీ ఇళ్లకు అందుతున్నాయా తల్లులారా?" అంటూ ఆప్యాయంగా పలకరించారు. అధికారపు హంగులు, ఆర్భాటాలు లేకుండా.. వారితో ఆత్మీయత మాట్లాడారు.

భట్టి విక్రమార్కను తమ మధ్య చూసిన ఆ మహిళల ముఖాల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం తమ జీవితాల్లో వచ్చిన మార్పులను చెబుతూ వారు భావోద్వేగానికి లోనయ్యారు. "ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంతోనే ఇంట్లో సంతోషంగా అన్నం వండుకుని తింటున్నాం.. మా పిల్లపాపలు కడుపునిండా అదే అన్నం తింటున్నారు" అని చెప్పినప్పుడు వారి మాటల్లో కనిపించిన తృప్తి.. సంక్షేమ పథకాల అసలైన అర్థాన్ని కళ్లముందు నిలిపింది.

కరెంటు బిల్లుల గురించి అడిగినప్పుడు.. "మాకు రూపాయి బిల్లు కూడా రావడం లేదు సార్.. ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది" అని వారు చెప్పిన మాటల్లో.. ఎన్నాళ్లుగానో మోస్తున్న ఆర్థిక భారాన్ని దించుకున్న నిశ్చింత స్పష్టంగా కనిపించింది.

ఇటీవల హైదరాబాద్‌కు కూలీ పనుల కోసం వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ఆ మహిళలు.. ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతగానో ఉపయోగపడిందని ఆనందంగా చెప్పారు. ప్రయాణ ఛార్జీల కోసం ఖర్చయ్యే డబ్బు మిగలడం.. తమ కుటుంబ అవసరాలకు ఎంతో ఆసరాగా మారిందని కృతజ్ఞతతో తెలిపారు. ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం అందిస్తున్న పథకాలు మా జీవితాల్లో నిజమైన వెలుగులు నింపుతున్నాయని శ్రమజీవులు ఆనందంగా చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, మీరు ఉచితంగా పొందుతున్న ప్రతి పథకానికి మీ తరపున ఆర్థిక శాఖ ఆయా శాఖలకు క్రమం తప్పకుండా నిధులు చెల్లిస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించడం.. ఆ అవసరాలను తీర్చడం.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఈ ప్రజా ప్రభుత్వం అసలైన బాధ్యతని డిప్యూటీ సీఎం అన్నారు.

# వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం






- **ముఖ్యఅతిథి ఖమ్మం నగర మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ**

వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం నగర మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ పాల్గొని మాట్లాడారు . ప్రజలలో చాలామందికి నేత్రదానంపై అపోహలు ఉన్నాయని దీనిపై అవగాహన లేదని సోషల్ మీడియాలో మరియు మీడియా ద్వారా ప్రచారింపజేసి అవగాహన తీసుకురావాలని కోరారు . ఒక దాత ఇద్దరుకు దృష్టిని దానం చేయవచ్చు అని అన్నారు . కళ్ళు మన శరీరంలో అత్యంత విలువైన భాగం కాబట్టి వాటిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని తదనంతరం నేత్రదానం చేయాలని సూచించారు . ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ కిషన్ , డాక్టర్ శివరాం , డాక్టర్ సృజన్ మాట్లాడుతూ వయస్సు , లింగ భేదం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు . కళ్ళద్దాలు ధరించేవారు , మధుమేహం , అధిక రక్తపోటు మొదలైన సమస్యలతో బాధపడేవారు , కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకున్నవారు కూడా కళ్ళను దానం చేయవచ్చు . ఎయిడ్స్ , రేబిస్ , హెపటైటిస్ బి/సి , సెప్సిస్ లేదా కొన్ని రకాల క్యాన్సర్లు ఉన్నవారు నేత్రదానం చేయడానికి అనర్హులు . మరణించిన తర్వాత 4 నుండి 6 గంటల లోపు కళ్ళను సేకరించాల్సి ఉంటుందని కావున వ్యక్తి మరణించిన వెంటనే స్థానిక ఐ బ్యాంకుకు సమాచారం అందించాలని కోరారు . నేత్రదానం ప్రాముఖ్యత చాలామందికి తెలవదని అన్నారు . కళ్ళు తొలగించడం వల్ల ముఖం వికృతంగా మారదు . లక్షలాది మంది భారతీయులు కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారు. సేకరించిన కళ్ళ ద్వారా అంధత్వం ఉన్న వారికి అమర్చి వారికి చూపు ప్రసాదించవచ్చు అని పేర్కొన్నారు, నేత్రదానం చేద్దాం .. చూపును పంచుదాం ! అని అవగాహన ర్యాలీ ని జడ్పీ సెంటర్ వరకు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మేనేజర్ మానుకొండ వీరభద్రం మరియు వాసవి ఐ కేర్ హాస్పిటల్ ఖమ్మం బృందం పాల్గొన్నారు .

# యువత సమస్యలపై రాజీలేని పోరాటాలకు ఏఐవైఎఫ్ మహాసభలు



- **రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**హుజూరాబాద్,ఆగష్టు 30(తెలంగాణ ముచ్చట్లు ):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మూడో మహాసభలను పురస్కరించుకుని హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పోలోజు రంజిత్ కుమార్, హుజూరాబాద్ మండల అధ్యక్షురాలు చిట్టి లావణ్య అధ్యక్షత వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల పరిష్కారం, విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు యువత రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యువతను మరింత చైతన్యవంతం చేసి, వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు అన్నారు. హుజూరాబాద్ ప్రాంతంలోని యువకులు, విద్యార్థులు, సమైక్య శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, ప్రతినిధులు గంగేటి సరళ, పెండాల లావణ్య, ప్రసాద్, చెలిక ప్రసాద్, సతీష్, రాజిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల డిమాండ్లపై సీఎం సానుకూలత



- **హర్షం వ్యక్తం చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం**

**ఇల్లంతకుంట, ఆగస్టు 30, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారి డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంపై తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హర్షం వ్యక్తం చేసింది. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం రాచపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఫోరం రాష్ట్ర సెక్రెటరీ జనరల్, జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడారు. ఇటీవల కేకే కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కమిటీ నిర్ణయాలను వివరించిందని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించడం అభినందనీయమన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, ఆరోగ్య కార్డులు, ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించే అంశాలపై కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ విధానంలో దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు చెప్పారు. ఉద్యమకారుల సంక్షేమంపై సానుకూలంగా స్పందించి తీపి కబురు అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫోరం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో కేవలం పోలీస్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు నమోదైన వారినే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గ్రామాలు, మండలాల్లో ప్రత్యక్షంగా పోరాటం చేసిన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బీరయ్య, మహమ్మద్ లాల్, నాగేష్, సదానందం, సారయ్య, రాజా కుషావలి, వెంకటేష్, మహేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆసరా పెన్షన్లకు నేడే చివరి అవకాశం!

- **అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి**
- **కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 30, (తెలంగాణ ముచ్చట్లు):** ఆసరా, చేయూత పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు ఇదే చివరి అవకాశం. కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 31 చివరి తేదీ అని జమ్మికుంట 11వ వార్డు కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన అధికారిక సర్క్యులర్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. 57 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు పెన్షన్‌కు అర్హులని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు గడువు ముగిసేలోగా సమీపంలోని మీసేవ, ఈసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, జనన లేదా విద్యా ధ్రువీకరణ పత్రం, ఫొటో వెంట తీసుకెళ్లాలని చెప్పారు. ఒకే కుటుంబంలో 57 ఏళ్లు నిండిన వారు ఇద్దరు ఉంటే వారిలో ఒక్కరు మాత్రమే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకే ఇంటి నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకుంటే పరిశీలన సమయంలో ఒక దరఖాస్తు తొలగించబడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ పోనగంటి విష్ణువర్ధన్ కోరారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం...

- **రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు**



**ఖమ్మం బ్యూరో , ఆగస్టు -30(తెలంగాణ ముచ్చట్లు):** దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.
మధిర నియోజకవర్గంలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.
చింతకాని మండలంలోని కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, రూ.1.75 కోట్లతో లచ్చగూడెం -నేరడ పీఆర్ రహదారి వరకు చింతకాని- వందనం ఆర్అండ్‌బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.7 కోట్లతో లచ్చగూడెం-అనంతారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.
చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ.5.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.
బోనకల్ మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో రూ.63 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, రూ.1 కోటితో ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ.19 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.
నారాయణపురంలో రూ.80.84 లక్షలతో నిర్మించిన 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను, మోటమర్రిలో రూ.24.50 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను డిప్యూటీ సీఎం ప్రారంభించారు.
అదేవిధంగా కలకోట రాపల్లి-గన్నవరం-ముసలిమడుగు-లక్ష్మీపురం రహదారిని రూ.57 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు, బ్రాహ్మణపల్లి-గన్నవరం మీదుగా రాపల్లి వరకు ఉన్న పీడబ్ల్యూడీ రహదారిని రూ.26 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు శంకుస్థాపనలు చేశారు. రాపల్లిలో రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ నేటి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కోసం అనేకకార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.
రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, 53 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం క్రింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు.
ఇండ్లు లేని నిరుపేదలకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇప్పటి వరకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు.
నిరుద్యోగ యువత కోసం తొలి ఏడాదిలో 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశామని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా క్రింద రికార్డు సమయంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని కేవలం 9 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని అన్నారు.
ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు.
గత ప్రభుత్వం పెట్టిన వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది పేద విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు.

**విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు:**
విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ 100 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మంజూరు చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక్కో ఇంటిగ్రేటెడ్ గురుకులాన్ని రూ.200 కోట్ల నిధులతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నా మని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒకే కుటుంబంలా కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను నిర్మిస్తున్నామని, తద్వారా సామాజిక మార్పుకు నాంది పలుకుతున్నామని తెలిపారు. తెలంగాణలో మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను మంజూరు చేశామని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మెస్ చార్జీలను 40 శాతం, కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు.

**రోడ్లు, నీటిపారుదల, వైద్య రంగాలకు భారీగా నిధులు:**
రాష్ట్రంలోని రహదారి నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు రూ.90 వేల కోట్లతో పలు ప్రణాళికలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులకు మరో రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన భూసేకరణను పూర్తిచేయడానికి భారీ ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, అదనంగా 14 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

**మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ భీమా:**
మహిళా సంఘాలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను వడ్డీ లేకుండా అందిస్తున్నామని డిప్యూటీ సీఎం అన్నారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా పథకం క్రింద రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వ్యతిరేకంగా కొంతమంది రాజకీయ వ్యక్తులు కృషి చేస్తున్నారని, వారి వలలో ప్రజలు పడవద్దని డిప్యూటీ సీఎం సూచించారు.
2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని, అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.
2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు బాటలు వేస్తున్నామని అన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన జపాన్, కొరియా వంటి దేశాలతో తెలంగాణ పోటీపడే విధంగా రాష్ట్రాన్ని నిలిపేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో క్యాబినెట్, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, విద్యుత్ శాఖ సీఈ అశోక్, ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, సీపీఓ శ్రీనివాస్, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 32 ఏళ్ల ఆర్టీసీ సేవలకు ఘన వీడ్కోలు





- **కె.జె. రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానం**

**హుజూరాబాద్,ఆగష్టు 30(తెలంగాణ ముచ్చట్లు ):** వేములవాడ TGSRTC డిపోలో డిస్పాచ్ సెక్షన్‌లో 19 ఏళ్లుగా విశేష సేవలందించిన కంకణాల జలంధర్ రెడ్డి (కె.జె. రెడ్డి) 32 ఏళ్ల సుదీర్ఘ ఆర్టీసీ ఉద్యోగ ప్రస్థానాన్ని విజయవంతంగా ముగించి పదవీ విరమణ పొందారు. హుజూరాబాద్ మండలం కనుకులగిద్ద గ్రామానికి చెందిన కె.జె. రెడ్డి 1993లో ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేసి ఆర్టీసీలో మెకానిక్‌గా ఉద్యోగంలో చేరారు.
డిపో మేనేజర్ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రైవర్లకు బస్సుల కేటాయింపు, బస్సుల మెయింటెనెన్స్ వంటి కీలక అంశాల్లో కె.జె. రెడ్డి అందించిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఆయన సమయస్ఫూర్తి, అంకితభావం, పనితీరు ఆదర్శనీయమని, ఆయన ఖాళీ చేసిన స్థానాన్ని భర్తీ చేయడం కష్టమని అన్నారు.
సామాజిక కార్యకర్త, జిల్లా అవార్డు గ్రహీత కంకణాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. తన సోదరుడు అధికారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 32 ఏళ్లపాటు ఆర్టీసీకి నిష్కళంకమైన సేవలు అందించారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు కంకణాల రాజిరెడ్డి-అహల్య దంపతుల కుమారుడిగా కె.జె. రెడ్డి సేవలందించడం గర్వకారణమన్నారు.
ఈ సందర్భంగా కె.జె. రెడ్డి తల్లిదండ్రులను డిపో యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. కె.జె. రెడ్డిని శాలువాతో సత్కరించి, పదవీ విరమణ శుభాకాంక్షల పత్రాన్ని అందజేశారు. సహోద్యోగులు, అధికారులు ఆయన సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు.
కార్యక్రమంలో PRO శ్రీనివాస్ యాదవ్, AMM ఆర్. రాంచందర్, VRO, డిపో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు, కుటుంబ సభ్యులు పాల్గొని కె.జె. రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జోడీల కలయికకు ప్రత్యేక గుర్తింపు

- **సంబంధాల నిర్మాణంలో కీలక పాత్ర**
- **సంప్రదాయం నుంచి సాంకేతికత వరకు మార్పులు**
- **నమ్మకం, అవగాహనకు ప్రాధాన్యం**



డెస్క్, ఆగస్టు 30 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ప్రతి ఏడాది ఆగస్టు 31న జరుపుకునే నేషనల్ మ్యాచ్ మేకింగ్ డే అనేది జీవిత భాగస్వాముల ఎంపిక, పరిచయాలు, బంధాల నిర్మాణంలో మ్యాచ్ మేకింగ్ ప్రక్రియ పోషించే కీలక పాత్రను గుర్తు చేసే ప్రత్యేక దినంగా భావిస్తారు. వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాకుండా రెండు కుటుంబాల మధ్య ఏర్పడే బంధమని సమాజం ఎప్పటి నుంచో భావిస్తోంది. అలాంటి బంధాలకు పునాది వేయడంలో మధ్యవర్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, వివాహ పరిచయ వేదికలు పోషిస్తున్న పాత్రను ఈ రోజు సందర్భంగా గుర్తుచేసుకుంటారు. కాలం మారుతున్నా సరైన వ్యక్తిని సరైన భాగస్వామితో కలపాలనే లక్ష్యం మాత్రం మారలేదని నిపుణులు చెబుతున్నారు. భారతీయ సంస్కృతిలో వివాహాలకు ఎప్పటినుంచో ప్రత్యేక స్థానం ఉంది. గతంలో కుటుంబ పెద్దలు, బంధువులు, గ్రామ పెద్దలు కలిసి వధూవరుల కుటుంబాల గురించి తెలుసుకుని వివాహ సంబంధాలను కుదిర్చేవారు. కుటుంబ నేపథ్యం, విలువలు, విద్య, ఆర్థిక స్థితి, వ్యక్తిత్వం వంటి అనేక అంశాలను పరిశీలించి సంబంధాలను నిర్ణయించేవారు. ఈ విధానం ద్వారా అనేక కుటుంబాలు తరతరాలుగా బలమైన బంధాలను కొనసాగించాయి. అందుకే మ్యాచ్ మేకింగ్ అనేది కేవలం పరిచయం కల్పించడం మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతగా కూడా పరిగణించబడింది.

ప్రస్తుతం ప్రపంచం డిజిటల్ యుగంలోకి అడుగుపెట్టడంతో మ్యాచ్ మేకింగ్ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. మ్యాట్రిమోని వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, సోషల్ మీడియా వేదికలు వివాహ పరిచయాలకు ప్రధాన సాధనాలుగా మారాయి. దేశం నలుమూలలతో పాటు విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా తమ అభిరుచులు, అర్హతలు, జీవన లక్ష్యాలకు అనుగుణంగా భాగస్వాములను వెతికే అవకాశం పొందుతున్నారు. సాంకేతికత కారణంగా దూరాలు తగ్గిపోవడంతో సరైన జోడిని ఎంపిక చేసుకునే అవకాశాలు మరింత విస్తరించాయి. మ్యాచ్ మేకింగ్ ప్రక్రియలో నమ్మకం అత్యంత కీలకమైన అంశంగా నిపుణులు పేర్కొంటున్నారు. సంబంధం ఏర్పడే ముందు వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, విలువలు, భవిష్యత్ లక్ష్యాలు, కుటుంబ ఆలోచనా విధానం వంటి అంశాలు సరిపోవడం చాలా అవసరం. కేవలం బాహ్య అంశాల ఆధారంగా కాకుండా వ్యక్తిత్వం, బాధ్యత, పరస్పర గౌరవం వంటి లక్షణాలు కూడా సంబంధాన్ని బలంగా నిలబెడతాయి. అందువల్ల విజయవంతమైన వివాహ బంధానికి సరైన ఎంపిక ఎంత ముఖ్యమో ఈ రోజు గుర్తుచేస్తుంది.

నేటి యువత వివాహాల విషయంలో స్వతంత్ర నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, కుటుంబ సభ్యుల సలహాలు, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రేమ వివాహాలు, సంప్రదాయ వివాహాలు, పరిచయాల ద్వారా జరిగే వివాహాలు వంటి అనేక విధానాలు ప్రస్తుతం సమాజంలో కనిపిస్తున్నాయి. ఏ విధానం అయినా చివరికి పరస్పర అంగీకారం, అవగాహన, గౌరవం ఉన్నప్పుడు మాత్రమే బంధం విజయవంతమవుతుందని సామాజిక నిపుణులు చెబుతున్నారు. మ్యాచ్ మేకింగ్ రంగం ఇప్పుడు ఒక పెద్ద పరిశ్రమగా కూడా అభివృద్ధి చెందింది. వేలాది సంస్థలు, ఆన్‌లైన్ సేవలు, వివాహ పరిచయ కేంద్రాలు ప్రత్యేక సేవలను అందిస్తున్నాయి. వ్యక్తుల విద్య, ఉద్యోగం, ఆసక్తులు, జీవనశైలి వంటి అంశాల ఆధారంగా అనుకూలమైన జోడీలను సూచించే సాంకేతిక వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత సిఫార్సులు కూడా ఈ రంగంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

సామాజికంగా చూస్తే మ్యాచ్ మేకింగ్ అనేది కేవలం వివాహాలకే పరిమితం కాకుండా మనుషుల మధ్య బలమైన సంబంధాల నిర్మాణానికి కూడా ప్రతీకగా నిలుస్తుంది. కొత్త వ్యక్తులను పరిచయం చేయడం, స్నేహాలను పెంపొందించడం, కుటుంబాల మధ్య అనుబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలు కూడా దీనిలో భాగమే. అందుకే ఈ రోజు మానవ సంబంధాల విలువను గుర్తు చేసే సందర్భంగా భావిస్తారు. విజయవంతమైన దాంపత్య జీవితానికి సరైన భాగస్వామి ఎంపిక ఎంతో అవసరం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను కలిసి ఎదుర్కొనే వ్యక్తిని ఎంపిక చేయడం ఒక ముఖ్యమైన నిర్ణయం. అలాంటి నిర్ణయాల్లో సరైన మార్గదర్శకత్వం, విశ్వసనీయ సమాచారం, పరస్పర అవగాహన ఎంతో కీలకం. ఈ అంశాలను ప్రోత్సహించడంలో మ్యాచ్ మేకింగ్ విధానాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి.

నేషనల్ మ్యాచ్ మేకింగ్ డే సందర్భంగా అనేక సంస్థలు సంబంధాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. వివాహానికి ముందు పరస్పర అవగాహన, కుటుంబ విలువలు, భావోద్వేగ అనుబంధం, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై చర్చలు నిర్వహిస్తారు. సంబంధాలు బలంగా ఉంటే సమాజం కూడా బలంగా ఉంటుందనే సందేశాన్ని ఈ కార్యక్రమాలు ప్రజలకు చేరవేస్తాయి. మొత్తంగా నేషనల్ మ్యాచ్ మేకింగ్ డే అనేది సరైన వ్యక్తులను కలపడం ద్వారా జీవితాలను ఆనందమయం చేసే ప్రక్రియకు అంకితమైన రోజు. సంప్రదాయ పద్ధతుల నుంచి ఆధునిక సాంకేతిక వేదికల వరకు మారుతున్న విధానాల మధ్య కూడా నమ్మకం, ప్రేమ, గౌరవం, అవగాహన వంటి విలువలే విజయవంతమైన బంధాలకు పునాది అని ఈ ప్రత్యేక దినం మరోసారి గుర్తు చేస్తోంది. జంటల కలయికతో ప్రారంభమయ్యే బంధాలు కుటుంబాల ఆనందానికి, సమాజ స్థిరత్వానికి ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా నిపుణులు పేర్కొంటున్నారు.

# ఆఫ్రికన్ వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు

- **సమానత్వం, గౌరవం కోసం ప్రత్యేక దినం**
- **ప్రపంచ అభివృద్ధిలో విశేష కృషికి సత్కారం**
- **ఐక్యరాజ్యసమితి గుర్తించిన ప్రాధాన్య రోజు**

**డెస్క్ ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం ఆగస్టు 31న ఆఫ్రికన్ సంతతికి చెందిన ప్రజల అంతర్జాతీయ దినోత్సవం ను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఆఫ్రికన్ మూలాలు కలిగిన ప్రజల చరిత్ర, సంస్కృతి, వారసత్వం, ప్రపంచ అభివృద్ధికి వారు అందించిన విశేష సేవలను గుర్తించి గౌరవించేందుకు ఐక్యరాజ్యసమితి ఈ ప్రత్యేక దినాన్ని ప్రకటించింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో నివసిస్తున్న ఆఫ్రికన్ సంతతికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన పెంపొందించడం కూడా ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. ఆఫ్రికన్ సంతతికి చెందిన ప్రజలు శతాబ్దాలుగా ప్రపంచ చరిత్రలో కీలక పాత్ర పోషించారు. విజ్ఞాన శాస్త్రం, సాహిత్యం, సంగీతం, కళలు, క్రీడలు, రాజకీయాలు, ఆర్థిక రంగాలు వంటి అనేక విభాగాల్లో వారు చేసిన కృషి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ చారిత్రకంగా బానిసత్వం, వలస పాలన, జాతి వివక్ష వంటి అనేక సమస్యలను వారు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి హక్కులు, గౌరవం, సమాన అవకాశాల కోసం అంతర్జాతీయ స్థాయిలో చర్చలు జరగాల్సిన అవసరాన్ని ఈ రోజు గుర్తు చేస్తుంది. 2021లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఆఫ్రికన్ సంతతికి చెందిన ప్రజలపై వివక్షను నిర్మూలించడం, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడం, సమానత్వాన్ని ప్రోత్సహించడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాలు. ఈ దినోత్సవం ద్వారా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలపై ప్రపంచ దేశాలకు స్పష్టమైన సందేశం అందుతోంది. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆఫ్రికన్ మూలాలు కలిగిన ప్రజలు గణనీయమైన జనాభాగా ఉన్నారు. వారు తమ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, కళారూపాలను పరిరక్షించుకుంటూనే ఆయా దేశాల అభివృద్ధిలో భాగస్వాములుగా కొనసాగుతున్నారు. సంగీతం, నృత్యం, సాహిత్యం, ఫ్యాషన్, క్రీడలు వంటి రంగాల్లో వారి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. వారి సాంస్కృతిక వారసత్వం ప్రపంచ వైవిధ్యానికి ఒక గొప్ప సంపదగా భావించబడుతోంది.

ఈ సందర్భంగా అనేక దేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, విద్యా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఆఫ్రికన్ చరిత్ర, సంస్కృతి, వారి పోరాటాలు, విజయాలను ప్రజలకు పరిచయం చేసే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారు. యువతలో సమానత్వం, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. వివక్ష రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశాన్ని ఈ దినోత్సవం అందిస్తుంది. ఆఫ్రికన్ సంతతికి చెందిన ప్రజల అంతర్జాతీయ దినోత్సవం కేవలం ఒక జాతి లేదా సమూహానికి సంబంధించిన రోజు మాత్రమే కాదు. ప్రపంచంలోని ప్రతి మనిషికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు ఉండాలనే మానవతా భావనను గుర్తుచేసే సందర్భం కూడా. వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, వివక్షకు తావులేని సమాజాన్ని నిర్మించడమే ఈ దినోత్సవం ప్రధాన సందేశంగా నిలుస్తోంది.



# మత్తు వ్యసనంపై మానవాళికి హెచ్చరిక

- **ఓవర్‌డోస్ మరణాలు ప్రపంచానికి సవాల్**
- **యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిది**
- **అవగాహనే ప్రాణాలను రక్షించే ఆయుధం**

**డెస్క్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం ఆగస్టు 31న నిర్వహించే ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే కేవలం ఒక అవగాహన కార్యక్రమం మాత్రమే కాదు. మత్తు పదార్థాల వినియోగం ఎంతటి విషాదాలకు దారితీస్తుందో ప్రపంచానికి గుర్తుచేసే హెచ్చరిక దినం. ఓవర్‌డోస్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన లక్షలాది మందిని స్మరించుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు సమాజం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించే సందర్భం కూడా ఇదే. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగత సమస్య కాదని, అది కుటుంబాలు, సమాజం, దేశాల అభివృద్ధిని ప్రభావితం చేసే సామాజిక సమస్య అని ఈ రోజు స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మత్తు పదార్థాల వినియోగం ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో వ్యసనాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, మానసిక సమస్యలు, చెడు స్నేహాలు, సామాజిక ప్రభావాలు, ఆసక్తి వంటి కారణాలతో చాలామంది యువకులు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారు. ఒకసారి వ్యసనానికి బానిసైన తర్వాత దాని నుంచి బయటపడటం చాలా కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితి కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా సమాజ భవిష్యత్తును కూడా ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

ఓవర్‌డోస్ అనేది కేవలం అధిక మోతాదులో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే శారీరక సమస్య మాత్రమే కాదు. అది ఒక వ్యక్తి జీవితాన్ని ఒక్క క్షణంలో ముగించే ప్రమాదకర పరిస్థితి. శ్వాసకోశ వ్యవస్థ పనిచేయకపోవడం, గుండె స్పందనలో లోపాలు, మెదడు కార్యకలాపాలు నిలిచిపోవడం వంటి సమస్యలు ఓవర్‌డోస్ సమయంలో సంభవిస్తాయి. సమయానికి వైద్య సహాయం అందకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఓవర్‌డోస్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరం. వ్యసనాల ప్రభావం వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాదు. ఒక వ్యక్తి మత్తు పదార్థాలకు బానిసైతే అతని కుటుంబం కూడా తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయి. ఉద్యోగాలు, విద్య, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలు ప్రభావితమవుతాయి. కొన్నిసార్లు నేరాలకు కూడా వ్యసనాలు కారణమవుతాయి. అందుకే మాదక ద్రవ్యాల సమస్యను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా సామాజిక, ఆరోగ్య, మానసిక కోణాల్లో కూడా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రపంచంలోని అనేక దేశాలు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం కఠిన చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లు, అంతర్జాతీయ ముఠాల కారణంగా ఈ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. మత్తు పదార్థాల లభ్యత పెరగడం యువతను మరింత ప్రమాదంలోకి నెడుతోంది. అందుకే ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయడంతో పాటు విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, కుటుంబాలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలి. మత్తు పదార్థాల వ్యసనాన్ని చాలా మంది ఇంకా ఒక నేరంగా లేదా వ్యక్తిగత వైఫల్యంగా చూస్తున్నారు. కానీ వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది ప్రధానంగా ఒక ఆరోగ్య సమస్య. వ్యసనానికి గురైన వ్యక్తులకు విమర్శలు కాకుండా సరైన చికిత్స, కౌన్సెలింగ్, మానసిక మద్దతు అవసరం. సమాజం వారిని దూరం పెట్టకుండా పునరావాసం కోసం ప్రోత్సహించాలి. అలా చేసినప్పుడే వారు తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి అవకాశం ఉంటుంది.

ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేస్తుంది. అది అవగాహన శక్తి. చాలా సందర్భాల్లో ప్రజలకు సరైన సమాచారం లేకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఓవర్‌డోస్ లక్షణాలు ఏమిటి, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎక్కడ సహాయం పొందాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చు. విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు, మీడియా ఈ విషయంలో మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం డిజిటల్ యుగంలో యువత ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతోంది. ఈ పరిస్థితిని సానుకూలంగా ఉపయోగించుకుని సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా వ్యసనాల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించవచ్చు. నిజ జీవిత కథనాలు, నిపుణుల సూచనలు, పునరావాసం పొందిన వారి అనుభవాలు యువతపై ప్రభావం చూపగలవు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాన్ని వారికి స్పష్టంగా వివరించడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉంచే అవకాశం ఉంటుంది.

ఈ దినోత్సవం సందర్భంగా ఓవర్‌డోస్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం కూడా ముఖ్యమైన అంశం. ప్రతి మరణం వెనుక ఒక కుటుంబం, ఒక జీవితం, ఒక భవిష్యత్తు దాగి ఉంటుంది. ఆ నష్టాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేం. కానీ అలాంటి విషాదాలు మరెవరికి జరగకుండా చర్యలు తీసుకోవడం ద్వారా వారి జ్ఞాపకాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది. అందుకే ఈ రోజు సంతాపంతో పాటు బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది. మొత్తంగా ఇంటర్నేషనల్ ఓవర్‌డోస్ అవేర్‌నెస్ డే ప్రపంచ సమాజానికి ఒక బలమైన సందేశాన్ని అందిస్తోంది. మత్తు పదార్థాలపై పోరాటం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. కుటుంబాలు, విద్యాసంస్థలు, వైద్య రంగం, మీడియా, సామాజిక సంస్థలు, యువత——అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. అవగాహన, చికిత్స, పునరావాసం, మద్దతు అనే నాలుగు స్తంభాలపై ఈ పోరాటం కొనసాగితేనే ఓవర్‌డోస్ మరణాలను తగ్గించడం సాధ్యమవుతుంది. ప్రాణాల విలువను గుర్తిస్తూ, వ్యసన రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే సందేశాన్ని ఈ ప్రత్యేక దినం ప్రపంచానికి అందిస్తోంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బీసీ జనగణనపై కేంద్రాన్ని నిలదీసిన శ్రీనివాస్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)




నమోదు చేసి, రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లకు బలమైన చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడా బీసీ జనగణన అంశంలో స్పష్టత చూపడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బీసీల సంఖ్య బయటపడితే రాజకీయ సమీకరణాలు మారుతాయనే భయంతోనే ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారా అనే అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో 80 కోట్లకు పైగా ఓబీసీ జనాభా ఉన్నప్పటికీ, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం లేదని అన్నారు. ఓబీసీ కులాలకు ఎస్సీ, ఎస్టీ తరహాలో అధికారిక నంబరింగ్ వ్యవస్థను అమలు చేయాలని ఆయన సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో పిలుస్తున్న నేపథ్యంలో ముందుగా సమగ్ర జాబితా రూపొందించి, అనంతరం జనగణన చేపట్టాలని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ జనగణన, రిజర్వేషన్ల అంశాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలు ఉద్యమ బాట పట్టే పరిస్థితి ఏర్పడుతుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ప్రధానమంత్రి ఈ అంశంపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దేశ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలగోని బాల్‌రాజు గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో హోరాహోరీగా కరాటే పోటీలు

- **విజేతలకు బహుమతులు అందజేసిన ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు**

**హుజురాబాద్,ఆగస్టు 30(తెలంగాణ ముచ్చట్లు ):**





టైగర్ పంచ్ కరాటే క్లబ్ హుజురాబాద్ ఆధ్వర్యంలో (డబ్ల్యూ ఎఫ్ఎస్ కె ఓ) సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్పు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా పోటీపడ్డారు.

ఈ కార్యక్రమానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. క్రీడాకారులను అభినందిస్తూ కరాటే వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి హుజురాబాద్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన టైగర్ పంచ్ కరాటే క్లబ్ నిర్వాహకులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్, మండల ప్రెసిడెంట్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కరాటే కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# మిస్ అరా గ్రాండ్ ఫినాలే విజేతగా రోహిణి

**మల్కాజిగిరి, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న జయప్రకాష్, భారతి దంపతుల కుమార్తె రోహిణి మరో ఘనత సాధించారు. అహ్మదాబాద్‌లో ఈ నెల 23న జరిగిన మిస్ అరా గ్రాండ్ ఫినాలేలో విజేతగా నిలిచి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు రోహిణిని ఘనంగా సన్మానించారు.

ప్రస్తుతం రోహిణి వికారాబాద్‌లోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ చదువుతున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తూనే మోడలింగ్, అందాల పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. 2025 సెప్టెంబర్‌లో గోవాలో జరిగిన జాతీయ స్థాయి మిస్ పి అండ్ ఐ ఇండియా పోటీల్లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన రోహిణి.. మిస్ రియాలిటీ షో, మిస్ టాలెంట్ షో అనే రెండు ప్రతిష్టాత్మక సబ్‌టైటిల్స్‌ను గెలుచుకున్నారు. విద్యతో పాటు రోహిణి కూచిపూడి శాస్త్రీయ నృత్యంలోనూ ప్రతిభ కనబరిచారు. 2012 డిసెంబర్ 25న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మూడో అంతర్జాతీయ కూచిపూడి నృత్య సదస్సులో భాగంగా సిలికానాంధ్ర ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన మహా బృందనాట్యంలో ఆమె పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో 5,794 మంది కళాకారులు పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా రోహిణికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ కూడా లభించింది.

విద్య, అందాల పోటీలు, మోడలింగ్, కూచిపూడి నృత్యాన్ని సమన్వయం చేసుకుంటూ రోహిణి తన లక్ష్యాల వైపు ముందుకు సాగుతున్నారు. భవిష్యత్తులో మిస్ ఇండియా కిరీటాన్ని సాధించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.




# నేడు సిలుకు సిలుకు చీరలు ఫుల్ సాంగ్ విడుదల

- **చిత్రీకరించిన క్యాతంపల్లిలోనే పాట ఆవిష్కరణ..**
- **ఆదరించాలని టీం విజ్ఞప్తి**

**ధర్మసాగర్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

జానపద నేపథ్యంలో రూపొందిన 'సిలుకు సిలుకు చీరలు నాకే తెస్తానంటాడు నా మొగుడే' ఫోక్ సాంగ్ పూర్తి వీడియోను సోమవారం సాయంత్రం ధర్మసాగర్ మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాటను చిత్రీకరించిన ప్రదేశంలోనే ఫుల్ సాంగ్‌ను విడుదల చేయడం ప్రత్యేకతగా నిలవనుంది.

ఇప్పటికే విడుదలైన ప్రోమోకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోందని, పూర్తి పాటను కూడా ప్రేక్షకులు ఆదరించాలని టీం కోరింది. సోమవారం విడుదల కానున్న 'సిలుకు సిలుకు చీరలు' ఫుల్ సాంగ్‌ను ప్రతి ఒక్కరూ వీక్షించి, లైక్ చేసి, షేర్ చేస్తూ తమ బృందాన్ని ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. జానపద కళలు, గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే ఈ పాటకు ప్రేక్షకుల ఆశీస్సులు, ఆదరణ అందించాలని వారు కోరారు.

# బంగారం ధరలకు బ్రేక్..!

**హైదరాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

డాలర్ బలపడటం, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో దేశంలో బంగారం ధరలు ఇటీవలి రోజుల్లో తగ్గుతున్నాయి. వచ్చే వారం కూడా పసిడి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలపై అంచనాలు పెరగడంతో డాలర్, అమెరికా బాండ్లకు డిమాండ్ పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. దీంతో బంగారం, వెండిపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఆగస్టు 30 ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,240గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,45,050గా, 18 క్యారెట్ల పసిడి రూ.1,18,680గా నమోదైంది. కిలో వెండి ధర రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లోనూ ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో 24 క్యారెట్ల బంగారం రూ.1,58,240, 22 క్యారెట్ల పసిడి రూ.1,45,050గా ఉంది. మాత్రం 24 క్యారెట్ల ధర రూ.1,58,390గా, 22 క్యారెట్ల ధర రూ.1,45,200గా నమోదైంది.

# జూపిటర్ 110పై అదిరే ఆఫర్.. నెలకు రూ.2,474 ఈఎంఐతో సొంతం!

**హైదరాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**




రోజువారీ ప్రయాణాలకు సౌకర్యంగా ఉండే స్కూటర్ కోసం చూస్తున్న వారికి టీవీఎస్ జూపిటర్ 110 మంచి ఎంపికగా నిలుస్తోంది. కుటుంబ అవసరాలకు అనువుగా ఉండటంతో ఈ స్కూటర్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. నగదు చెల్లింపుతో కాకుండా ఈఎంఐ ద్వారా కొనుగోలు చేయాలనుకునేవారికి కూడా ఫైనాన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

**రూ.74,125 నుంచి ప్రారంభ ధర**

జూపిటర్ 110 బేస్ వేరియంట్ ధర సుమారు రూ.74,125 నుంచి ప్రారంభమవుతుంది. ఇది ఎక్స్‌షోరూమ్ ధర కాగా.. రోడ్డు పన్ను, బీమా, రిజిస్ట్రేషన్ వంటి ఖర్చులు అదనంగా ఉంటాయి.

**నెలకు రూ.2,474 ఈఎంఐ**

36 నెలల రుణ కాలపరిమితి, 9.7 శాతం వడ్డీ రేటుతో బేస్ వేరియంట్‌కు నెలకు సుమారు రూ.2,474 ఈఎంఐగా ఉండొచ్చు. డౌన్ పేమెంట్, వడ్డీ రేటు, రుణ కాలవ్యవధిని బట్టి ఈఎంఐ మారుతుంది.

**కుటుంబ వినియోగానికి ప్రత్యేక ఫీచర్లు**

జూపిటర్ 110లో 113.3 సీసీ ఇంజిన్, ఎల్‌ఈడీ లైట్లు, డిజిటల్ కన్సోల్, బ్లూటూత్ అనుసంధానం, నావిగేషన్, యూఎస్‌బీ ఛార్జింగ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. సీటు కింద సుమారు 30 లీటర్ల నిల్వ సామర్థ్యం ఉండటంతో రెండు హెల్మెట్లు పెట్టుకునే అవకాశం ఉంది. తాజాగా ద్విరంగు వేరియంట్‌ను కూడా సంస్థ తీసుకొచ్చింది.

# ఫోన్ తడిసిందా? ఈ తప్పులు చేస్తే అంతే..

**హైదరాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**

వర్షంలో తడవడం, పొరపాటున నీటిలో పడటం వంటి కారణాలతో మొబైల్ ఫోన్ తడిసిపోవచ్చు. అలాంటి సమయంలో కొన్ని పొరపాట్లు చేస్తే ఫోన్ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే ఫోన్ తడిసిన వెంటనే కింది జాగ్రత్తలు పాటించాలి.

**ఇలా అస్సలు చేయొద్దు**


నోటితో ఊదడం, హెయిర్ డ్రైయర్‌తో వేడి గాలి పెట్టడం, ఎండలో పెట్టడం, మైక్రోవేవ్‌లో పెట్టడం వంటివి చేయకూడదు. అలాగే బియ్యంలో పాతిపెట్టడం కూడా సరైన పద్ధతి కాదు. తడిసిన ఫోన్‌ను వెంటనే ఛార్జింగ్‌కు పెట్టడం అత్యంత ప్రమాదకరం.

**ముందుగా ఫోన్‌ను ఆపేయాలి**

ఫోన్‌ను శుభ్రమైన గుడ్డతో తుడిచి, సిమ్ కార్డు ట్రేను తొలగించాలి. వీలైతే తక్కువ శక్తితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్‌తో రంధ్రాల వద్ద ఉన్న నీటిని తొలగించవచ్చు.

**24 గంటలు సహజంగా ఆరనివ్వాలి**

ఫోన్‌ను పొడి, పత్తి గుడ్డపై ఉంచి ఫ్యాన్ గాలి తగిలేలా కనీసం 24 గంటలు ఉంచడం సురక్షితం. ఉప్పునీరు లేదా మురుగునీటిలో పడితే వెంటనే ఫోన్‌ను ఆపేసి, బయట భాగాన్ని శుభ్రమైన నీటితో తేలికగా శుభ్రం చేయాలి. పూర్తిగా ఆరిన తర్వాతే వినియోగించడం మంచిది.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎరువుల నిర్వహణలో సాంకేతిక విప్లవం

- - రైతులకు మరింత పారదర్శక సేవలు
- - సమగ్ర పర్యవేక్షణకు కొత్త వ్యవస్థ
- - దేశవ్యాప్తంగా ఎరువుల లావాదేవీల అనుసంధానం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**





దేశంలో ఎరువుల నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర ఎరువుల నిర్వహణ వ్యవస్థ కొత్త దశలోకి ప్రవేశించింది. రైతుల పంటల వివరాల నమోదుకు ఉపయోగిస్తున్న వ్యవస్థతో దీనిని అనుసంధానం చేయడం ద్వారా ఎరువుల అవసరాలు, పంపిణీ, వినియోగంపై మరింత ఖచ్చితమైన సమాచారం అందుబాటులోకి రానుంది. రైతులకు సరైన సమయంలో అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుంది. దేశవ్యాప్తంగా 14 కోట్లకుపైగా ఆధార్‌తో అనుసంధానమైన కొనుగోలుదారులు, 2.5 లక్షలకు పైగా చిల్లర విక్రయ కేంద్రాలు, ఏడాదికి సుమారు 7 కోట్ల మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలకు సంబంధించిన వివరాలు ఈ వ్యవస్థలో నమోదవుతున్నాయి. దీంతో ఎరువుల సరఫరా గొలుసులో ప్రతి దశను పర్యవేక్షించే అవకాశం అధికారులకు లభిస్తోంది. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల పంపిణీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఎరువుల ఉత్పత్తి, దిగుమతులు, రవాణా, నిల్వలు, రాష్ట్రాలు మరియు జిల్లాల వారీగా పంపిణీ, చిల్లర విక్రయాలకు సంబంధించిన వివరాలను ఒకేచోట పరిశీలించేలా ప్రత్యేక విశ్లేషణ వేదికలను అభివృద్ధి చేశారు. ఈ సాంకేతిక వేదికల ద్వారా ఎక్కడైనా ఎరువుల కొరత లేదా సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు తగ్గుతాయని భావిస్తున్నారు. రైతులు ముందుగానే ఎరువులను బుక్ చేసుకునే విధానాన్ని కూడా ఈ వ్యవస్థతో అనుసంధానం చేశారు. మొబైల్ ఆధారిత బుకింగ్ విధానం ద్వారా రైతులు తమ అవసరాలను ముందుగానే నమోదు చేసుకోవచ్చు. ఆ వివరాల ఆధారంగా సంబంధిత ప్రాంతాలకు తగినంత ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచేలా అధికారులు ప్రణాళికలు రూపొందించగలుగుతారు. దీని వల్ల సరఫరా ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. ఎరువుల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత వంటి సమస్యలను కూడా నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడుతున్నారు. దేశ వ్యవసాయ రంగ అవసరాలకు అనుగుణంగా ఎరువుల నిర్వహణను ఆధునీకీకరించే దిశగా ఈ చర్యలు మైలురాయిగా నిలుస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు సరైన సమయంలో అందుబాటులో ఉండేలా చేయడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, నిర్ణయాల్లో ఖచ్చితత్వాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై ఎరువుల పంపిణీ ప్రక్రియలో డేటా ఆధారిత నిర్ణయాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది.

# భవిష్యత్ పరిశ్రమలకు నైపుణ్యం అవసరం

- - పీఎం-సేతు సదస్సులో రాజ్‌నాథ్ సింగ్
- - ఉపాధి, స్వయం ఉపాధికి కొత్త అవకాశాలు
- - పరిశ్రమలతో శిక్షణ సంస్థల భాగస్వామ్యం

**లక్నో, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు):**




దేశ రక్షణ తయారీ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్లు, రోబోటిక్స్, ఆధునిక తయారీ రంగాల్లో భారత్ వేగంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువశక్తిని తీర్చిదిద్దడం అత్యంత కీలకమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన పీఎంసేతు పరిశ్రమల సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడే పరిశ్రమలను అభివృద్ధి చేయాలంటే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని వినియోగించగల శిక్షణ పొందిన మానవ వనరులు అవసరమని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

పీఎంసేతు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం, పరిశ్రమలు, శిక్షణ సంస్థల మధ్య కొత్త తరహా భాగస్వామ్య వ్యవస్థను రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు ప్రత్యక్షంగా భాగస్వామ్యం అవుతూ పారిశ్రామిక శిక్షణా సంస్థల ఆధునీకరణ, పాఠ్యాంశాల రూపకల్పన, శిక్షణా విధానాల మెరుగుదలలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. దీంతో విద్య పూర్తిచేసిన యువత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తయారవుతారని పేర్కొన్నారు. శిక్షణతో పాటు అప్రెంటిస్‌షిప్ అవకాశాలను విస్తరించడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశాలు పెరగడం వల్ల యువత ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోగలరని తెలిపారు. పరిశ్రమల అవసరాలు, విద్యాసంస్థల బోధన మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఈ విధానం కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రక్షణ తయారీ, డ్రోన్ సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యాలున్న యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ రంగాల్లో భారత్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేందుకు యువత కీలక శక్తిగా నిలుస్తారని అన్నారు. దేశ యువతను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయడమే పీఎంసేతు కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, శిక్షణ సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ఉపాధి, వ్యవస్థాపకత రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టించవచ్చని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు మరింత వేగం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈవో శశిధర్ జగదీశన్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 30 (తెలంగాణ ముచ్చట్లు) :**




ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఉన్న శశిధర్ జగదీశన్ పదవీ విరమణ నిర్ణయాన్ని ప్రకటించారు. తన పదవీకాలాన్ని పొడిగించాలని బోర్డు చేసిన పునర్నియామక ప్రతిపాదనను ఆయన తిరస్కరించినట్లు బ్యాంక్ వెల్లడించింది. ఆయన ప్రస్తుత పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనుంది.

**బోర్డు విజ్ఞప్తిని సైతం తిరస్కరించిన జగదీశన్**

పదవీకాలాన్ని పొడిగించే అంశంపై మరోసారి ఆలోచించాలని బోర్డు సభ్యులు కోరినప్పటికీ.. జగదీశన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదని సమాచారం. ఈ విషయాన్ని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన అధికారిక ఫైలింగ్‌లో వెల్లడించింది. బ్యాంక్ వృద్ధి, దీర్ఘకాలిక స్థిరత్వానికి ఆయన అందించిన సేవలను బోర్డు ఈ సందర్భంగా ప్రశంసించింది.

**హెచ్‌డీఎఫ్‌సీ విలీనంలో కీలక పాత్ర**

హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో శశిధర్ జగదీశన్ కీలక పాత్ర పోషించారని బోర్డు పేర్కొంది. దేశ కార్పొరేట్ రంగంలో అత్యంత కీలకమైన ఈ విలీనాన్ని సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఆయన నాయకత్వాన్ని కొనియాడింది. ఆయన పదవీ విరమణకు ముందే తదుపరి ఎండీ, సీఈవో ఎంపిక ప్రక్రియను ప్రారంభించినట్లు బ్యాంక్ తెలిపింది.

**ఆదిత్య పూరి తర్వాత బాధ్యతలు**

దాదాపు రెండు దశాబ్దాల పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు నాయకత్వం వహించిన ఆదిత్య పూరి పదవీ విరమణ అనంతరం 2020 అక్టోబర్‌లో శశిధర్ జగదీశన్ ఎండీ, సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన బ్యాంక్‌లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) సహా పలు కీలక బాధ్యతలను నిర్వహించారు.

# అనుష్క తొలి ప్రేమ జ్ఞాపకం

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క శెట్టి.. తన చిన్ననాటి తొలి ప్రేమ జ్ఞాపకాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను ఆరో తరగతి చదువుతున్న సమయంలో ఓ అబ్బాయి తనకు నేరుగా 'ఐ లవ్ యు' చెప్పాడని అనుష్క గుర్తుచేసుకున్నారు. ఆ వయసులో 'ఐ లవ్ యు' అంటే ఏమిటో కూడా తనకు తెలియదని, అందుకే అమాయకంగా 'సరే' అని సమాధానం ఇచ్చానని నవ్వుతూ చెప్పారు. ఆ సంఘటన తన జీవితంలో అత్యంత అమాయకమైన, అందమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని తెలిపారు.

**పెళ్లిపై అనుష్క ఏమన్నారంటే?**

నలభై ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోకపోవడంతో అనుష్క వ్యక్తిగత జీవితంపై తరచూ పుకార్లు వస్తుంటాయి. అయితే సరైన వ్యక్తి ఎదురైనప్పుడు సహజంగానే పెళ్లి జరుగుతుందని ఆమె గతంలో పేర్కొన్నారు. తన వివాహ విషయాన్ని తల్లిదండ్రులకే వదిలేశానని, పెళ్లి కుదిరిన రోజున అందరికీ బహిరంగంగా తెలియజేస్తానని స్పష్టం చేశారు.

**నటనతో ప్రత్యేక గుర్తింపు**

సినిమా రంగంలోకి రాకముందు ముంబైలో యోగా శిక్షకురాలిగా పనిచేసిన అనుష్క.. 'సూపర్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. 'అరుంధతి', 'బాహుబలి', 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచే అనుష్క.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లకు దూరంగా ఉంటారు.



# మహిళల చిత్రీకరణపై మోనాలిసా

సినిమాల్లో కథానాయికలను వస్తువులుగా చూపించడంపై జరుగుతున్న చర్చకు ప్రముఖ భోజ్‌పురి నటి మోనాలిసా స్పందించారు. తెరపై చర్మ ప్రదర్శన కంటే దాన్ని ఎలా చిత్రీకరిస్తున్నారన్నదే ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు.

హిందీ సినిమాల్లోనూ చర్మ ప్రదర్శన ఉంటుందని, అయితే దాన్ని కళాత్మకంగా, అందంగా చూపించడం వల్ల ప్రేక్షకులకు అసభ్యంగా అనిపించకపోవచ్చని మోనాలిసా అన్నారు. ప్రాంతీయ చిత్రాల్లో, ముఖ్యంగా భోజ్‌పురి సినిమాల్లో కొన్నిసార్లు ఇలాంటి సౌందర్యాత్మక చిత్రీకరణ లోపిస్తుందని పేర్కొన్నారు.

**ప్రజెంటేషన్ చాలా ముఖ్యం**

నడుము లేదా ఇతర శరీర భాగాలను చూపించే సన్నివేశాలను కూడా అందంగా, కళాత్మకంగా చిత్రీకరిస్తే ప్రేక్షకులపై ప్రభావం భిన్నంగా ఉంటుందని ఆమె తెలిపారు. మహిళా పాత్రలను తెరపై చూపించే విధానానికి ఎంతో ప్రాధాన్యం ఉందని మోనాలిసా స్పష్టం చేశారు.

**'పెద్ది'పై చర్చ నేపథ్యంలో**

ఇటీవల రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'పెద్ది'లోని కొన్ని సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వచ్చిన నేపథ్యంలో మోనాలిసా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కథానాయికను అతిగా శృంగారభరితంగా చూపించారంటూ కొందరు విమర్శలు వ్యక్తం చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in